క్లుప్తంగా

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: మండలంలో సోమవారం నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తెలిపారు. యథావిధిగా వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి ఇంటి వద్దే పింఛన్లను పొందాలన్నారు. వారంలోపు తీసుకునేలా చూడాలని పేర్కొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



దిగువమత్యం దళితవాడలో కరపత్రాలు అందజేస్తున్న సభ్యులు

తవణంపల్లె: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఆదివారం మండలంలోని దిగువమత్యం దళితవాడలో భగవద్గీత గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, మన పండుగలు, సంప్రదాయాలు, గ్రంథాల గురించి వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షుడు ధనుంజయ, సభ్యులు మునిరత్నం, చంద్రబాబు, చటర్జీ, విమల, చిట్టెమ్మ, శాంతమ్మ, కిరణ్, ఈశ్వర్, చాముండి, సుష్మిత, నాగమ్మ, జ్యోతీశ్వరి, సరళాదేవి పాల్గొన్నారు.

జిరాక్స్ షాప్‌లు మూసివేయాలి

యాదమరి: పదో తరగతి పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు యాదమరిలోని జిరాక్స్ షాప్‌లు మూసివేయాలని ఎస్‌ఐ సుమన్ తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కనుల పండువగా రాములోరి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గుడిపాల: మండలంలోని కోలావూరు, గట్రాళ్ల మిట్ట రామాలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. అలాగే సామూహిక కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

యువతలో దేశభక్తి పెంపొందిద్దాం



మాట్లాడుతున్న ప్రతాపరెడ్డి

చిత్తూరు రూరల్: యువతలో దేశభక్తి, దైవభక్తి పెంపొందించేందుకు సభ్యులు కృషి చేయాలని బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి అన్నారు. ఆదివారం చిత్తూరు నగరంలోని రామకృష్ణ ఆశ్రమంలో జిల్లా విశ్వ హిందూ పరిషత్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హిందూ సమాజ శ్రేయస్సుకు ప్రతి గ్రామంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కమిటీలు వేయాలన్నారు. అనంతరం నగర కమిటీని జిల్లా కార్యదర్శి వేలు వెల్లడించారు. నగర అధ్యక్షుడిగా ధరణి, కార్యదర్శిగా బాలాజీ, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రామభద్ర, మణికంఠ, జయచంద్ర, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


6న రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

పలమనేరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 6న చిత్తూరు అగ్నిమాపక కేంద్ర సమీపంలోని రెవెన్యూ భవనంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నికలు జరుగనున్నట్లు పలమనేరు శాఖ కార్యదర్శి కాకర్ల పురుషోత్తం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సొసైటీ జీవిత సభ్యులు, ప్యాట్రన్, వైస్ ప్యాట్రన్ కలిగిన వ్యక్తులు గుర్తింపు కార్డుతో తప్పక హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9980193555 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి తెప్పోత్సవాలు సోమ, మంగళ, బుధవారాల్లో అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. స్వామి వారు ప్రతి రోజూ రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు శ్రీరామచంద్ర పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు. అదేవిధంగా ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆలయ ఆవరణలో సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మొదటి రోజు సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారు తెప్పలను అధిరోహించి శ్రీరామచంద్ర పుష్కరిణిలో ఐదు చుట్లు విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రెండో రోజు ఏడు చుట్లు, చివరి రోజు తొమ్మిది చుట్లు తిరుగుతారు.

భానుడి భగభగ



- తీవ్రమవుతున్న ఎండలు
- బయటకు జంకుతున్న ప్రజలు
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు

గుడిపాల: ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అడుగు బయట పెట్టాలన్నా జనం జంకుతున్నారు. అత్యవసరమైన పరిస్థితి తప్పా ఇంటి నుంచి వెళ్లలేని పరిస్థితి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. వడదెబ్బతో ఆస్పత్రిలో చేరే రోగుల సంఖ్య పెరిగింది. ఎండలో ఎక్కువగా ఉన్నా డీహైడ్రేషన్, డయేరియా, వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. వడదెబ్బకు ప్రాథమికంగా నీరే ప్రాణధారమని, ప్రజలు సాధ్యమైనంత వరకు కొబ్బరి నీళ్లు బాగా తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సుకన్య తెలిపారు. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

ఎండలో పనులు చేస్తే..

వేసవికాలంలో ఎండ తీవ్రత ఉన్న సమయంలో పనులు చేయరాదు. ఉదయం, సాయంత్రం మాత్రమే పనులు చేసుకోవాలి. ఎండలో ఎక్కువసేపు పనిచేస్తే చర్మం పొడిబారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, ఒళ్లు నొప్పులు వస్తాయి. ఒక్కోసారి నీరసించి అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఇలాంటి తరుణంలో వడదెబ్బ బాధితులను శీతల ప్రాంతంలో ఉంచాలి. చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరానికి నీటి తడి గుడ్డతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

వేసవిలో చేయకూడనివి..

మండు వేసవిలో ఎక్కువగా తిరగరాదు. మద్యం జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. రోడ్లపై చల్లని పానీయాలు తాగరాదు. మాంసాహారం తగ్గించాలి. నూనెలో వేసిన ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తినకూడదు. వృద్ధులు, చిన్నారులు తగు జాగ్రత్తలు పాటించాలి.

వేసవిలో చేయాల్సిన పనులు

చల్లని నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి. పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. రోజుకు రెండు పూటలా స్నానం చేయాలి. భోజనం మితంగా తినాలి. లేతవర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి. ఆరుబయట పడుకున్నప్పుడు దోమతెరలు వాడాలి. బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకొని వెళ్లాలి. చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి. తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రత పాటించాలి.

వడదెబ్బకు ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. ఐస్ నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం బాగా తుడవాలి. శరీర సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి. లేనిపక్షంలో గ్లూకోజు, ఓఆర్ఎస్ లాంటి ద్రావణం తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు. వడదెబ్బ తగిలితే వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఇలా చేస్తే వేసవికాలంలో వడదెబ్బ నుంచి కొంతవరకు ఉపశమనం పొందవచ్చు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



గ్రంథాలయంలో విద్యార్థులు

గుడిపాల: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుడిపాల గ్రంథాలయాధికారి గజేంద్ర అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్, వేమన పద్యాలు, సుమతిశతకం, న్యూస్‌పేపర్లతో పాటు పలు పుస్తకాలను చదవడం వల్ల వారిలో నైపుణ్యత పెరగడంతో పాటు ఉద్యోగాలు పొందేందుకు వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

చిత్తూరు రూరల్: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్ష రాసే విద్యార్థులు సోమవారం నుంచి ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని జిల్లా ప్రజారవాణశాఖ అధికారి జితేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఇంటి నుంచి పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. ఇందుకు విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించాలన్నారు. సోమవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు పది పరీక్షలు జరగనున్నాయి. అప్పటి వరకు పబ్లిక్ సెలవులతో సంబంధం లేకుండా పరీక్షల షెడ్యూల్ ప్రకారం ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తున్నట్లు తెలిపారు. పల్లెవెలుగు, సిటీ బస్ సర్వీసుల్లో మాత్రమే అనుమతిస్తామన్నారు.

శేష వాహనంపై శ్రీరాముని వైభవం



కోదండరామస్వామికి హారతి

చిత్తూరు రూరల్: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నగరంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామివారు శేష వాహనంపై విహరించారు. తొలుత శ్రీరామునికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రీరామ నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఉదయం ఉత్సవమూర్తిని శేష వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. మేళతాళాల నడుమ ఊరేగింపు సాగింది. భక్తులు కర్పూర హారతులు పట్టి తరించారు. కార్యక్రమంలో చైర్మన్ సకల వెంకటేష్‌గుప్తా, ఈఓ సుబ్రమణ్యంనాయుడు, అర్చకులు వేణుగోపాల్, రాజా తదితరులు పాల్గొన్నారు.

కోదండరామునికి విశేష పూజలు



ఉత్సవమూర్తులను తీసుకెళుతున్న భక్తులు

తవణంపల్లె: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి సత్యమ్మకు పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి స్వామికి అఖండ హారతి ఇస్తూ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సోమవారం చక్రస్నానం నిర్వహిస్తామని ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు తెలిపారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 -5 గంటల మధ్యలో ప్రజలు వినతులు అందచేయవచ్చన్నారు. ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్‌సెంటర్ 08572232745, వాట్సాప్-9849907885 నంబర్లకు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని పేర్కొన్నారు.

కమనీయం.. అగస్త్యేశ్వరస్వామి కల్యాణం



పాల్గొన్న భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

చిత్తూరు రూరల్: పంగుణి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని ఈశ్వరగుడివీధిలోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముందుగా స్వామికి రుద్రాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణతో కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. కల్యాణ ఘట్టాన్ని భక్తులకు వివరించారు. తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఓం నమఃశివయా.. హరహర శంకరా అంటూ భక్తి ప్రపత్తులతో తరించారు. ఉదయం భిక్షాండి ఉత్సవంలో స్వామివారు అభయమిచ్చారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం అశ్వవాహన సేవ నిర్వహించారు. భక్తులకు పసుపు, కుంకుమ, కల్యాణోత్సవ ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శివప్రసాద్, అర్చకులు శివకుమార్, ఈఓ తిమ్మారెడ్డి, బలిజ సంఘం నాయకులు పూల సుబ్రమణ్యం, రామదాసు, రెడ్డప్ప, లోకనాథం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా



మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: పేద మహిళలకు ఆసరా వరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని 26 నుంచి 50 వార్డులకు సంబంధించిన రూ. 6.68 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. అలాగే గుడిపాలకు సంబంధించిన 1593 గ్రూపులకు గాను రూ. 18.82 కోట్లకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలుగా చేయూత అందిస్తూ ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. అర్హులైన మహిళలు ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, రాష్ట్ర మొదిలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞాన జగదీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సంక్షేమ బావుటా కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నగరంలోని 22వ డివిజన్ తేనబండలోని గంగాకాలనీ, బాలంబట్టులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. గంగాకాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. అదే విధంగా నగర శివారు ప్రాంతం కావడంతో అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువ జరుగుతున్నాయని.. పోలీసు పెట్రోలింగ్ పెంచి సీసీటీవీలు ఏర్పాటు చేయాలన్నారు. శ్మశానానికి వంకలో నుంచి వెళుతున్నామని.. దారి సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలను తెలుసుకోవడానికే ఇంటింటికి వస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి సమస్యను నమోదు చేసుకుని వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గడప గడప సమస్యల పరిష్కారానికి నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. ఈ నిధులతో కాలువలు, రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లీనారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్లు గంగా, జ్ఞానజగదీష్, నాయకులు త్రిమూర్తి, కృష్ణారెడ్డి, ప్రేమ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు కేంద్రాలు సిద్ధం

తవణంపల్లె: మండలంలో పదో తరగతి పరీక్షలకు రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తవణంపల్లె ఎంఈఓ శంకరయ్య తెలిపారు. అరగొండ బాలుర హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 236 మంది విద్యార్థులు, తవణంపల్లె కేంద్రంలో 166 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. ప్రశ్నపత్రాలు తవణంపల్లె పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు వెల్లడించారు.

ఐరాలలో మూడు కేంద్రాలు

ఐరాల: పదో తరగతి పరీక్షలకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలో 7 ప్రభుత్వ పాఠశాలల్లో 389 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఐరాల, ఎం.పైపల్లె, కాణిపాకం ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఐరాల ఉన్నత పాఠశాలలో 124, ఎం.పైపల్లె ఉన్నత పాఠశాలలో 125, కాణిపాకం ఉన్నత పాఠశాలలో 140 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష జరిగే సమయంలో మండలంలోని అన్ని జిరాక్స్ షాపులు మూసివేయాలని తెలిపారు.

ఘనంగా మట్టల పండుగ



చిత్తూరు: మట్టలతో ర్యాలీగా వెళ్తున్న క్రైస్తవులు

చిత్తూరు రూరల్: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని నగరంలోని క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. టౌన్ చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిష్టియన్ దాస్, చర్చి సభ్యులు ఈత మట్టలతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. భజనలు, గీతాలాపనలు చేస్తూ గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే సెయింట్ లూక్ చర్చి సభలో మట్టలతో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ శ్యామ్యూల్ బాబు పండుగ విశిష్టతను వివరించారు. అలాగే అంబేడ్కర్ నగర్‌లో చిన్నారులు, మత పెద్దలు కలిసి స్థానిక వీధుల్లో మట్టలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ దివ్య ప్రియ, సభ్యులు జోసెఫ్, జాన్సీ పాల్గొన్నారు.



గుడిపాలలో..

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని పలు చర్చిల్లో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బిషప్‌లు, పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బిషప్‌లు గుడ్‌ఫ్రైడే పవిత్రతను వివరించారు. ప్రార్థనల అనంతరం మట్టలతో ఊరేగింపుగా వెళ్లారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



చిత్తూరు అర్బన్: యాదమరి మండలం భూమిరెడ్డి పల్లె క్రాస్ వద్ద ఎస్ఈబీ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 53 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. విక్రేత చంద్రమోహన్ (28)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజు పాల్గొన్నారు.

పుష్ప సోయగం





విరబూసిన పుష్పాల వద్ద ఆనందంగా ఫొటోలు తీసుకుంటున్న భక్తులు





తిరుమలలోని పలు ప్రాంతాలలో భక్తులను కనులవిందు చేస్తున్న పుష్పాలు

కలియుగ వైకుంఠం తిరుమలలోని ప్రతి వస్తువు, చెట్టు, చేమల్లోనూ ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది. ఇక్కడున్న పలు చెట్లు ఆకులు రాలిపోయి కొత్త చిగుర్లు వేశాయి. కొన్ని నిండుగా పూలతో పరిమళాలను వెదజల్లుతున్నాయి. రోడ్ల పక్కన, నందన వనాల్లో ఉన్న చెట్లు పూలతో నూతన శోభను సంతరించుకుని హొయలుపోతున్నాయి. వాటిని చూసి భక్తులు తన్మయత్వం చెందుతున్నారు. కొందరు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని మురిసిపోతున్నారు. – తిరుమల